దిబ్బకి కరేపచెట్టు చచ్చూరుకుందని మరునాడే మామయ్యొచ్చి చెప్పాడు."

"పోనీ కొత్తిమెర... కొత్తిమెర వేసుంటావ్!... చెప్పెయ్!"... "ఇదిగో పులుసంతా కలుపుతున్నాను కొత్తిమెర రెమ్మ కనిపిస్తే ఛీ! అను పడతాను."

"మరేంటే గోల! ఏదో వాసన ! ఛీ!ఛీ! ఇది పులుసా. ఫాస్పరిక్ ఆసిడా?"

"ఏంలేదురా, నాన్నా,రెండుపుదీనా ఆకులు తరిగివేశానంతే సువాసన కోసం". "ఏంటీ, పుదీనా ఆకా ! అదన్న మాట ఆ చెత్తవాసన!. పులుసక్కర్లేదు. మజ్జిగ పోసెయ్"... "ఒక్క గరిటె పోసుకుని చూడ్రా! ఎంతో రుచిగా ఉందని మీ నాన్నగారు మరీ మరీ పోయించుకుని తాగారు. పోనీ అరచేతిలో పోయించుకుని రుచి చూడు బాబూ!". "ఒద్దని చెపితే నీ క్కాదూ! మజ్జిగ పోస్తావా,లేచి పొమ్మంటావా ?"

"ఇస్స్! బావకి రుచి చూపిద్దామని తెచ్చానూ, మా దొడ్లోని ఈ రెండాకులూ తీసుకో అత్తయ్యా- అని చెప్పి ఇచ్చిపోతే వేశాను కానీ, లేకపోతే నాకు మాత్రం ఆ ఆకుల మీద మోజాపాడా! ఎప్పుడన్నా వాడాను కనకనా!"

"ఎవరు?" . "ఎవరా - నీ మరదలు! పెదవేగి మామయ్య కూతురు. స్కూలుకెడుతూ రిక్షా దిగి ఇచ్చి పోయింది."

"మరామాట ముందే చెప్పలేదే!" .. "ఇప్పుడు చెప్పాగా!"

"వూఁ నువ్వన్నీ ఇట్టాంటి పన్లే చేస్తూంటావ్! అరిచేతిలో అరగరిటెడు పొయ్యి. వూఁ ఏదో ఉందిలే... అట్లా కొసిరి కొసిరి పోస్తావేంటి ? కొంచెం అన్న పెట్టి పోస్తే మాత్రం వొద్దన్నానా ! వూఁ, పొయ్యి!"

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక., 30-11-83.)

*** *** ***

# సుందరి విరహం

అర్ధరాత్రొచ్చి తలుపుతట్టాడు యోగారావు భార్య సుందరొచ్చి తలుపు తీసింది అంది: "ఆఁ మీరా, వచ్చేసారా మీకు వేయ్యేళ్ళాయుష్షండీ!. పొద్దున్నే కాకి అరిస్తేనూ మీరే మనస్సులోకొచ్చారు సుమండీ!... ఇంతఅర్ధరాత్రి రాకపోతే పొద్దున్నే రాకపోయారా. అసలే రైళ్ళల్లో దొంగల భయాలు అవ్వీనూ. పోనీండి... ఆ సూట్ కేసిల్లా ఇవ్వండి. మీ ట్రెయినింగు కాంపు బాగా జరిగిందా? మళ్ళీ వెళ్ళక్కర్లేదుగద!"

"ఆఁ బాగానే జరిగింది" అన్నాడు యోగారావు కుర్చీలో కూర్చుని బూట్లువిప్పుతూ.

" ఇదేం కాంపండీ బాబూ, మూణ్ణెల్లా! పిల్లలు బెంగపెట్టేసుకున్నారండీ! మీ గురించి మేం అనుకోని రోజు లేదు తెల్సా!. ఇక్కడ మేం మా పిన్ని కూతురు పెళ్ళికి రాజమండ్రి వెళ్ళి పదిహేను రోజులుండొచ్చాం వచ్చి వారమే అయింది. పెళ్ళిలో అంతా మీ గురించి అడగడమే - ఏమే సుందూ, పెళ్ళి కొచ్చేందుకు మీ ఆయన యోగారావుకి మూడురోజుల సెలవు దొరక్కపోయిందా, ఈయనొక్కడే ఉద్యోగం చేస్తున్నాడా! -అని నాకు భలే చిన్నతనమై పోయిందండీ!"

యోగారావు విసుక్కున్నాడు. " ఎంతసేపూ ఈ సోదేనా, మజ్జిగో మంచినీళ్ళో ఇస్తావా !" సుందరి నొచ్చుకుంది. " అయ్యో పొరబాటయిందండీ! మజ్జిగతెస్తాను. వేన్నీళ్ళు పెడతాను. లేవండి స్నానం చేసి భోంచేద్దురుగాని...ఎప్పుడు తిన్న తిండో, నాలుగు మెతుకులు తిని పడుకుంటేనే గాని బడలిక తీరదు"

విసురుగా తుండు తీసుకుని యోగారావు స్నానానికి వెళ్ళాడు.

రేడియోలో దక్షిణ భారత సంగీతసభ సమాప్తమయింది. సుందరి స్టేషన్లు తిప్పి వాయిస్ ఆఫ్ అమెరికాలోంచి ఇంగ్లీషు మ్యూజిక్ సన్నగా పెట్టింది. నాలుగు తమలపాకులు చిలక చుట్టి, మంచం మీద పడుకునున్న భర్తకి అందించింది. యోగారావు వాటిని అందుకున్నాడు.

సుందరి అంది: " నలుగురు పిల్లలూ పక్క గదిలో నిద్రపోతున్నారు. తలుపులన్నీ వేసేసి వచ్చాను .. మీ కిష్టమని సుగంధ శృంగార్ తెచ్చుంచాను. వెలిగిస్తానాగండి..." సుందరి రెండు వెలిగించింది. " ఊఁ, ఇప్పుడు చెప్పండి కబుర్లు " అంది.

యోగారావు అన్నాడు. " ఏవున్నాయి చెప్పటానికి! హైద్రాబాదునించి ఈఈ వచ్చి మాతో కాంపులో వారం రోజులున్నాడు. ప్రమోషన్ లిస్టులో నేనే మొదటివాణ్ణట. సూపర్నెంటుగా నన్ను ధవళేశ్వరం వెయ్యొచ్చుట. నాగురించి పెర్సనల్ ఫైలు చాలా బాగా రాసానని చెప్పాడు.... అన్నట్టు నాకో సర్టిఫికెట్టుకూడా ఇచ్చాడు- ఏ, బెస్ట్ ట్రెయనీ- అని."

సుందరి సంతోషపడింది " ఎంత మంచి వార్తండీ! ఏదీ, మీ చెయ్యిల్లా ఇవ్వండి...ప్చ్! ఉహుఁహుఁహుఁ, ప్చ్."

యోగారావు చెయ్యి వెనక్కిలాక్కుని ఆవులించాడు, 'మాఁయ్' అని.

" అప్పుడే పక్కమీదికి వాలిపోతున్నారా. మా పిన్ని ఇచ్చిన మైసూరుపాకం ముక్కలు మీకోసం నాలుగుంచాను. ఇవిగో ఇవి తిని పాలుతాగండి." అంది సుందరి.

" అర్ధరాత్రి ఇవ్వన్నీ ఏంటే గోల?"

గోముగా అంది సుందరి " వీటికి సమయం అర్ధరాత్రి కాకపోతే సూర్యోదయమా!.. పోనీ ఈ పాలు తాగండి. యాలకులేసి తెచ్చాను "

" సర్లే ఇయ్యి!" యోగారావు తప్పదన్నట్లు పాలు తాగాడు " మరి మేం చూసిన పెళ్ళి కబుర్లు అడగరేం? చెప్పనా .. మరండీ, పెళ్ళిలో కొత్త దంపతులచేత బొమ్మాడింపు దగ్గర దంపత్తాంబూలాలిప్పించినప్పుడు నాకు బలే బాధేసిందండి!". . " వాళ్ళిద్దరూ బొమ్మనాడించుకుంటే నీకు బాధేంటి మద్యలో!"

" దంపత్తాంబూలాలు దంపతులకే ఇస్తారు నాకొక్కత్తెకే ఇవ్వరు మరి అర్హతుండికూడా నేను తాంబూలం అందుకోలేకపోయాను గదా!"

" ప్చ్, బాడ్ లక్! మనూళ్ళో పెళ్ళేదయినా ఉందేమోచూడు ఇద్దరం వెళ్ళొద్దాం!"

సుందరినవ్వింది కసురుకుంటున్నట్టు అంది " చాల్లెండి! మీరు మరీని! దంపతుల

బంధువులకే ఇప్పించేది!... మరంతే ఆ పిల్లని గదిలోకి పంపించేవనిని మా పిన్ని నాకప్పగించింది అప్పుడు సరదాగానే ఉంది కానండి. ఏమిటో సిగ్గేస్తోంది చెప్పటానికి... ఇవతలకొచ్చాక- నాకు మటుకు- వికారమైపోయి- మనస్సంతా- పిచ్చెత్తినట్టయిపోయిందండీ!''

అమాయకంగా అన్నాడు యోగారావు! '' ఎందుకూ?''

'' ఎందుకేమిటి?... మీరు నాపక్కనలేనందుకు! మా పిన్ని నా కోసం ఒక గది ప్రత్యేకించింది కూడా!...హుఁ అంగట్లో అని ఉన్నా లాగా, మీ దర్శన భాగ్యం మాత్రం నాకు లేకపోయె!'' యోగారావు తనకేమీ పట్టనట్టు 'హాయ్' అన్నాడు. సుందరి అంది '' అన్నట్టు పెళ్ళివారు రాజమండ్రి అమ్మాయిల భోగం మేళం పెట్టించారు. ఆ పిల్లలు మన పెద్దమ్మాయి ఈడు వాళ్ళే తైతై మని పిచ్చి గంతులేస్తుంటే నాకు జాలి జాలేసిందండీ. వాళ్ళ జీవితాలెప్పుడు బాగు పడతాయో ఏంటో!''

''మనింటికి తీసుకొచ్చెయ్యక పోయావా నేను రమ్మన్నానని. వాళ్ళనుద్ధరించేందుకు ప్రయత్నించే వాణ్ణి.'' సుందరి కోప్పడింది. '' ఏంటీ మీరు రమ్మన్నారనా, మీ కోసమా! నలభయ్యేళ్ళ వయస్సుండి నలుగురు పిల్లల తండ్రయ్యుండి మీ కిప్పుడు భోగం పిల్లలు కావాల్సొచ్చారా! ఛీ, ఛీ, త్రాష్టపు ముండలు!''... '' ఏదో అటెండరు ఖాళీలొచ్చాయి ఇప్పిద్దాం అనుకున్నాను. వాళ్ళని తిట్టట మెందుకులే!''... '' ఆఁ, ముందర ఇంటిని బాగు చెయ్యండి... ఇదుగో- ఎదురుగుండా ఉన్నాను నన్ను బాగు చెయ్యండి!'' మళ్ళీ యోగారావ్ 'హాఁయ్' అన్నాడు.

'' ఏవండీ అక్కడ నాగార్జునసాగర్‌లో మీకు భోజనం బాగా కుదిరిందా? ... అయ్యో ఎట్లా చిక్కి పోయారో... లేచి కూర్చోండి.. ఊఁ ఎన్ని కష్టాలమ్మా నాకు... ఇట్లా నా చేతులు మీ చుట్టూ చుడితేనా వేళ్ళు కలుసుకునేవి కావు పూర్వం. ఇప్పుడు మణికట్టు రాసుకుంటున్నాయి.. మిమ్మల్ని వదిలి ఇంక ఒక్క క్షణం కూడా ఉండను. ఉండనంతే''

'' ఉండొద్దు... కానీ ఇప్పుడొదిలేయ్... తీసెయ్, నావంటిమీద చేతులు తీసేయ్!''

సుందరి అతన్ని చుట్టిన చేతులు తీసేసింది. అంది '' పోండి.. అన్నట్టు , మీరు సాగర్‌లో ఉన్న మూణ్ణెల్ల కాలంలోనూ ఒక్కసారైనా నేను మీకు జ్ఞాపకం రాలేదా?... చెప్పండీ... మహాకవులు రాసినట్టు మన పెళ్ళయిన కొత్తలో బొత్తులుకుబొత్తులు ఉత్తరాలు రాసేవారు నాకు.'' అంటూ ఆజ్ఞగా '' అసలు మీ ఖాళీ సమయాల్లో మీరేం చేసేవారు చెప్పండీ '' అంది.

'' ఆఁ , ఏముందీ, మధ్యాహ్నం పూట బట్టలుతుక్కునేవాణ్ణి, సాయంత్రం పూట డామ్ మీదకూర్చొని నాగార్జునుడు సన్యాసం స్వీకరించిన కధ జ్ఞాపకం తెచ్చుకునేవాణ్ణి రాత్రికి అమృతం తాగుతూ గడిపేవాణ్ణి''

'' ఆఁ తాగుడా! ఓరి దేవుడోయ్, ఇదెప్పట్నుంచంట!''.. '' ఏహె, అరవకు వెధవగోల! మా ఈ.ఈ. గారు కవిత్వం రాసాడు. అర్ధరాత్రి పూట మమ్మల్ని కూర్చోబెట్టి బలవంతంగా ఆ కవితామృతం మాచేత గ్రోలించేవాడు ''

సుందరి నిట్టూర్చింది. తాపీగా అంది '' హుఁ కవితామృతమా! ఏ విషయం మీద స్వామీ!''... ''పెళ్ళయిన ఒక ప్రియుడి తాలూకు గర్ల్ ఫ్రెండ్ తన వాకిట్లో బైలర్‌తో లేచిపోయింది. ఆ ప్రియుడి విరహం మీద సొంత కధే రాసుకున్నాడని మేం గుసగుస లాడుకునేవాళ్ళంలే''

'' మరి, మరి, అది వింటూంటే మీకు అదో రకంగా అనిపించి నేను గుర్తుకు రాలేదా? మీరు విప్రయోగం అనుభవించలేదా?''

" విప్రయోగమా అంటే ..?"

" విప్రయోగమంటే విప్రలాపం"

" విప్రలాభమంటె?"

" విసంవాదం"

" విసంవాదమా! అంటే వాదమా, దెబ్బలాటా! అక్కడ నేను ఎవ్వరితోనూ దెబ్బలాడలేదే! అంతా నన్ను నెత్తి కెక్కించుకున్నారు నేనే హౌస్ లీడర్ని"

" అబ్బా, విసంవాద మంటె కూడా తెలీదా! వియోగం! అంటే, ఎడబాటు, మాటతప్పిన ఎడబాటు! మీరు తొందరగా నెల్లాజుల్లో వచ్చేస్తానన్నారు ఇంత ఆలస్యంగా వచ్చారు. ( గోముగా) మరి, మరని, ఈ ఎడబాటూ గుబులూ మీకు అనుభవంలోకి రాలేదా?"

తేలిగ్గా తీసేసాడు యోగారావు " ఓహో అదా! ఏదీ విరహమా! చంపేసావ్ పో! ... ఇప్పుడీ వయస్సులో విరహమేమిటి నామొహం! కృష్ణా రామా అనుకునే వయస్సు! విరహమూ లేదు, విస్తరీ లేదు, పోయి పడుకో పో!"

సుందరి లేచెళ్ళి ఇంకో అగరొత్తు వెలిగించింది రేడియోలో స్టేసన్లు తిప్పి తిప్పి అంది "ఇదిగోనండి, ఆఫ్రికన్ ల్యూట్ మీద భలే మ్యూజిక్ వొస్తోంది" అని అంటూ వెనక్కి చూసింది ఈ రెండు మూడు నిమిషాల్లోనూ యోగారావు నిద్రలోకి జారుకున్నాడు సుందరి అతన్ని కదుపుతూ అంది " ఏవండీ, మూడునిముషాలకే నిద్రపట్టేసిందా!"

"ఊఁ ఊఁ ఊఁ ఏంటే?" ... " బయట పుచ్చ పువ్వులాగా వెన్నెల ఎంత బాగుందో చూశారా!" "ఆఁ మరే. " అంటూ వెంటనే 'హాఁయ్' అని ఆవులించాడు యోగారావు

ఈ వెన్నెలని చూసేకదా మన కవులు పులకించిపోయి పోటీలు పడి వర్ణించారూ. చంద్రుడిలో ఉన్న మచ్చ రెల్లుగుడిసెలో ఉన్న ఒక బెస్తవాడట వెన్నెల కిరణాలనే వలల్లో వాడు నక్షత్రాలనే చేపల్ని రాత్రంతా పట్టి పట్టి తెల్లారగానే తన గుడిసెలోకి పోయి సముద్రం అవతలి గట్టున మాయమవుతాడట ఎంతగొప్ప పోలిక ఇది! ఉపమకదూ! ... ఆనాడూ ఈనాడూ ఒకే వెన్నెలగదా! ... ఎంత సుమనోహరంగా ఉందీ దృశ్యం! ... మీకు ఒళ్ళు పులకించటం లేదూ? ... మీ మనస్సులో ఏవేవో చిలిపి ఆలోచనలు రేకెత్తటం లేదూ?. అవునండీ చంద్రుడిలో రాళ్ళు తెల్లగా పాల రాళ్ళలాగా ఉంటాయంటారా? .. ఏవండీ, మిమ్మల్నే, !" కుదిపింది.

" ఏం వెళ్ళి తెచ్చుకుందామనా! అవ్వి నల్లగా నీలంగా, ఎర్రగా, ఊదాగా, పచ్చగా అనేక రంగుల్లో ఉంటాయి "

" ఓహో! మన దొడ్లో నూతిపళ్ళెంలో ఉన్న ఉతుకుడు రాయిలాగానన్నమాట!"

" ఆఁ, మరే! ... సరిగ్గా దాన్లాగే ఉంటాయి అసలారాయి చంద్రుడిలోదే ... నేనే తెచ్చాను, నీ కోసం ... పడుకో, పో! ... హాఁయ్!"

" అబ్బ పోదురూ మరీనూ! ... మరండీ పెళ్లైనా ఏ ఆడదైనా ఎన్ని బాధలైనా భరించగల్దుగాని, భర్తనించి ఎడబాటు భరించలేదండీ!"

యోగారావు మత్తుగా మాట్లాడాడు " అని ఎవరు చెప్పారు?"

" కావ్యాల్లో నాయికలు చెప్పారు కావ్యాలు రాసిన మహా కవులు చెప్పారు నాయికలు విరహతాపాన్ని భరించలేక తామరాకుల్తో వంటిని కప్పుకొచ్చేవాళ్ళుట! సంపంగితైలాన్ని తలకి మర్దన

చేసుకుని చందనగంధం వంటికి పూసుకునే వాళ్ళుట! ఆ విరహిణులు వేడి వేడి నిట్టూర్పులకు వాళ్ళ కింది పెదిమలు కమిలినల్లబడి పోయేవిట! అసలు వాళ్ళ వంట్లో వేడికి మెడహారాల్లోని ముత్యాలేకాలి బూడిదైపోయి రాలిపోతూండేవిట!. అసలు .. ఇదేంటండీ, నా వంటికేంటో కాక తగిలినట్టుంది.. చెయ్యేసి చూడరూ.. మిమ్మల్నే!''

యోగారావు నిద్రలోంచి ఉలిక్కి పడ్డాడు ! `` ఆఁ ఆఁయ్యేయ్యేంటీ!''

`` నా వంటికి కాక తగిలినట్టుంది చూడరూ?.. పోన్లెండి, పెద్ద! . ఏవండీ మీరు సాగర్‌లో ఉండగా ఆ ఒంటరితనంలో మన పాత సంగతులు జ్ఞాపకం రాలేదా? . మన పెళ్లైన కొత్తలో మీరు మా అమ్మగారింటికొచ్చినప్పుడు అక్కడదొడ్లో అరటి చెట్లనీడలో ఒకే కుర్చీలో మనిద్దరం కూర్చొని కువకువలాడుకునేవాళ్ళం. జ్ఞాపకం లేదూ?... ఏవండీ, మిమ్మల్నే!''

`` ఆఁఆఁ, ఎన్నాళ్ళని ఒకే సీను జ్ఞాపకం వస్తుందీ! అందుకని జ్ఞాపకం తెచ్చుకోవటం మానేశాన్లే! పొద్దుపోయినట్టుంది, పడుకో!''

`` ఇంకా బోల్డు సీన్లున్నాయిగా! ఒకసారి మీరు మావాళ్ళ పొలంలోంచి ఇన్ని గుమ్మడి పూలు కోసుకొచ్చి ఆ పుప్పొడి అంతా దులిపి నా మొహానికి పూసి 'బ్యూటిఫుల్ బంగారు వన్నెతో మెరిసిపోతున్నావు' అన్నారు నన్ను అప్పుడు తెలీదుగానీండి, శృంగార నైషధం, కాదంబరి వంటి కావ్యాల్లో నాయికలు ఇట్లాగే పూసుకుంటారని ఇప్పుడు తెలుస్తోంది. తాపాన్ని తగ్గిస్తుందట పుప్పొడి... ( నిట్టూరుస్తూ) దొడ్లో సింపుల్‌గా నాలుగు కాకరపాదులన్నా వేసుకున్నాను కాదు, వచ్చినంతొచ్చేది పుప్పొడి!.. ఏవండీ... నిద్రపోతున్నారా! . అన్నట్టు శృంగార నైషధం అంటే గుర్తు కొచ్చింది - దమయంతి తన ప్రియుడు నలుడితో ఎడబాటు భరించలేక పోయిందట. చంద్రకాంతివల్ల ఆమె విరహం ఎక్కువై పోతోందిట. దాంతో ఆమె తన చెలికత్తెల్ని - అద్దం తీసుకురండే, అందులో వీణ్ణిపట్టి చావగొడతాను- అందిట... అయ్యో ఇప్పుడు కిటికీలోంచి వెన్నెలొచ్చిపడి మీ బుగ్గల్నీ కంఠాల్నీ మెరిపిస్తూ నాకెంతగా పిచ్చెక్కిస్తోందో! దమయంతి అద్దం పగలగొట్టిందని, మీ బుగ్గలు నేను పగలగొడతానా... అమ్మో, నా బంగారు బుగ్గలు కదూ!... ఊఁ హుఁహుఁహుఁహూఁ...''

సుందరి హఠాత్తుగా ముందుకొంగి భర్తబుగ్గల్ని ముద్దుపెట్టుకోబోయింది. విసురుగా కదిలాడు యోగారావు. `` ఎహె ఏంటే నీగోల! నన్నివ్వాళ నిద్రపోనివ్వవేంటే!''.. `` ఏవండీ మీకిది న్యాయమేనా? నా బాధ అర్థం చేసుకోరేమండీ!... దొంగల భయాలూ, చీకటి భయాలూ ఇట్లా ఎన్నో భయాల్తో ఉన్న రాత్రిళ్ళు నలుగురు పిల్లల్తో నేనెట్లా బితుకు బితుకు మంటూ గడిపానో మీ కెట్లా చెప్పేది! అసలు... అసలు... నా ఎడబాటు బాధ... క్షోభ... ఎంతనుభవించానో .. ఎట్లా చెప్పేది!

... రాజమండ్రిలో ఆ పెళ్ళయిన మర్నాడు గోదాట్లోకి లాంచి షికారు ఏర్పాటు చేసింది మా పిన్ని. అందరం గోదారి మధ్యలో లంకలో కెళ్ళాం, అక్కడ్నుంచీ పెళ్ళయిన వాళ్లంతా జంటలు జంటలుగా విడిపోయి తలో వైపుగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు నే నొక్కదాన్నే పిల్లల్తో మిగిలి పోయాను. ఆ ఇసుకచూడగానే చిన్న పిల్లనై పోయాను. ఎగిరి గెంతాలనిపించింది. మన పెద్దపిల్లలు నవ్వుతారేమోనని సిగ్గుపడ్డాను. చివరికి ఎట్లాగైతేనేం వాళ్ళని దూరంగా పంపించాను. పిచ్చికగూళ్ళు కట్టాలనిపించింది. మీరు నాకూడా ఉండుంటే ఇద్దరం చెరొకటీ కట్టేవాళ్ళం. అవ్విమన కోటలన్నమాట! ఆ తర్వాత మనం శంఖాలు ఏరి తీసుకొస్తాం. అవ్వి మన భటులన్నమాట పదినిముషాల్లో ఎవరెన్ని ఏరి తీసుకురాగలిగితే అన్ని తీసుకొచ్చి మన కోటల ముందర ఇసకలో గుచ్చుతాం. మనకోటలకి సమాన దూరాల్లో దూరంగా నుంచుని మీ సైన్యం మీద నేను, నా సైన్యం మీద మీరు గులకరాళ్ళు విసుర్తాం. పది నిముషాలయ్యాక

ఆపేసి చూస్తాం ఎవరి సైన్యం ఎక్కువగా నేల కరుస్తుందో వాళ్ళు ఓడిపోయినట్టు, గెలిచినవాళ్ళు ఓడినవాళ్ళ కోటని తొక్కి నాశనం చేసేస్తారు నేను ఓడాననుకోండి, మీ కాళ్లకి మొక్కుతాను, మీరు ఓడారనుకోండి.. ఏవండోయ్, మిమ్మల్నే."

" ఊఁఊఁ,ఊఁ ఊఁ ఏంటి?"

" మీరు ఓడారనుకోండి, నాకాళ్ళకి మీరు మొక్కాలి!"

అంత మత్తులోనూ యోగారావుకి బుస్సున కోపమొచ్చేసింది " ఏయ్, ఏంటీ కథ, నేన్నీకు మొక్కటమా!... ఇంపాసిబుల్!"

" అహఁహఁ.. ఊరికే ఆట పద్ధతి చెబుతున్నానండీ, అంతే ఇంట్లో చిన్నప్పుడు ఆడుకునేవాళ్ళం. ఇన్నాళ్ళకి ఆ ఏట్లో ఇసకలో వంటరిగా ఉండగానే నా గుండెల్లో గూడుకట్టుకున్న చిన్ననాటి ఆ సరదా బయటకొచ్చేసింది... కానీ.. ప్చ్... మీరులేరు.

అప్పుడు నేను లాంచీ టాపెక్కి చూస్తూ నుంచున్నాను దూరంగా నీటి ప్రవాహం చీల్చటం వల్ల ఏర్పడ్డ ఇసకతిన్నెల భాగాలు అచ్చం మీలాగే మీరు పడుకున్నారా అన్న భ్రమకలిగిస్తూ కనుపించాయి. విశాలమైన మీ ఛాతీ, వెడల్పాటి పిరుదులూ, లావాటితొడలూ, ఇట్లా కనిపించాయండీ! మీ గురించిన ఆలోచనల్తో మనస్సు నాలో రెపరెపలాడి పోయిందనుకుంటూంటే ఇంటికొచ్చేసరికి పరాపరాకోసేసినట్లే అయిపోయింది. అప్పుడింక నాకు కాళిదాసే గతి అయ్యాడు "

యోగారావు కంగారుపడ్డాడు " కాళిదాసా, వాడెవడు?"

" అబ్బే మన మహాకవి కాళిదాసండీ! ఆయన రాసిన మేఘసందేశం చదువుతూ కూర్చునే దాన్ని... నాబాధ ఎక్కువైందేగాని వీసం కూడా తగ్గలేదు!"

"మైగాడ్, కాదంబరీ, శృంగారనైషధం, మేఘసందేశం ఇవన్నీ ఎక్కడ తగిలాయి నీకు పొద్దున్నే!"

" ఎమ్.ఏ. తెలుక్కు కడదామని బుద్ధిపుట్టి బుక్స్ తెప్పించి చదువుతున్నానండి... ఇస్స్, మీరు లేనప్పుడు వాటిని చదవటం గొప్పపొరటయిపోయిందండీ!"

" ముందర చదివేసావు, నన్నిప్పుడు వాయించేస్తున్నావు. ఇప్పుడేమనుకుంటే ఏంలాభం!.. హాఁయ్!"

" చాల్లెండి!... ఇంటికొచ్చానా, వేసంకాలం గదా, దొడ్లోకొబ్బరిచెట్టుకింద కాస్సేపు కూర్చుందామంటే పక్క దొడ్లోంచి నైట్ క్వీన్ వాసనొచ్చి నా ప్రాణం తీస్తుంటే ఆగలేక నేనొచ్చి వాకిట్లో కుర్చీలో కూర్చుంటే నన్నేడిపించటానికే వాళ్ళు పెళ్ళి చేసుకున్నారా అన్నట్టు- ఎదురింటి మేడలో కొత్త దంపతుల కిలకిలలయ్యే. గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్టు ఇంతలో మన పెద్దమ్మాయొచ్చి - నాన్నారి కోసం అంత బెంగేంటే అమ్మా, వస్తార్లేవే. వంటయింది వడ్డిస్తున్నాను రావే - అనగానే నామనస్సు సిగ్గుతో ఎంత అతలాకుతలం అయిపోయిందో మీకెట్లా చెప్పగల్ను!...

... ఎప్పుడో పంపిస్తానన్న ముత్యాలదండను ఇదే సమయమన్నట్టు మా అమ్మనాకు పంపించింది. మీ అంతట మీరు దాన్ని నా మెళ్ళోవేసి నా మెడకి అందమొచ్చిందని మెచ్చుకుంటే గదా నాకు తృప్తి... హుఁ దాన్ని ఏ మూలో పడేసాన్లెండి. ఏమండీ వింటున్నారా! నెలకిందట హరి హరంగారొచ్చారు, నాగార్జునసాగర్లో ఆయన మిమ్మల్ని కలిశార్టగదాః మీరు నల్లబడ్డారనీ, చిక్కి పోయారనీ, తొందర్లో వస్తానన్నారనీ నాలుగంటే నాలుగే ముక్కలు చెప్పి వెళ్ళిపోయారు ఆయన మాటలు టేప్ చేసాను

రహస్యంగా! ఆ తర్వాత ఎన్ని వందల మాట్లు ఆ టేపు వేసుకుని ఆ మాటలు విన్నానో! విన్నకొద్దీ గుబులు పెరిగి పెరిగి ఎంత క్షోభ అనుభవించానో !.. ఏమండీ, ఎట్లా అర్థమవుతుందండీ మీకు!.. క్యాంపుల్లో ఉన్న భర్తలకు భార్యలు ఉత్తరాలు రాయకూడదని తెలుసు అయినా ఒకరోజు ఉత్తరం రాయడం మొదలు పెట్టాను. ఇంక ఈ వంటరిజీవితం నావల్లకాదని చివరికి తేల్చేద్దామనుకున్నాను. రాస్తుంటే నాకు ఏడుపొచ్చిందండీ. ఆ ఆవేశం తగ్గాక చూసుకుంటే నా కన్నీళ్లుపడి అక్షరాలన్నీ చెరిగిపోయాయి ఉత్తరాల్లోకూడా మన్ని మాట్లాడనిచ్చుకోలేదు పాపిష్టిదేవుడు!.. " సుందరికి హఠాత్తుగా ఆవేశం పొర్లుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది

యోగారావు లేచి కూర్చుని " ఏయ్, ఏడవకు" అని మళ్ళీ పక్కమీద వాలాడు.

రెండునిమిషాల తర్వాత ఆవేశం తగ్గి సుందరి అంది " ఏమైనా సరే, ఇక మిమ్మల్ని క్షణం కూడా వదిలి పెట్టి ఉండను ఎడబాటు భరించలేను." విసుగ్గా యోగారావు అన్నాడు " ఇప్పుడు నానిద్ర అంతా పాడు చేసావుగా!"

సుందరి నిశ్చయంగా అంది " అసలు మీకు ఏ ఫీలింగులేదా! ఎందుకిట్టా తయారయ్యారు. మూడేళ్ల కిందట ఓ మారు ఈ గుబులొచ్చింది పోయిందనుకున్నాను. మళ్లీ మొదలా!"

" చూడమ్మాయ్, నలభైమూడు దాటింది నాకు. ఇహ అర్థరాత్రి కబుర్లు వగైరాలు మనకి ఆరోగ్యం కాదు అదీ విషయం!"

కోపంగా అంది సుందరి. " ఏం ఎందుక్కాదు? అస్సలు మనసులు విప్పుకోకపోవటమే ఈ వయస్సుకు అనారోగ్యం సంసార జీవితంలో మనం ఎదుర్కొనే అనేక చికాకుల్నించి దూరంగా కాస్సేపు గడిపి రిలీఫ్ తీసుకోకపోవటమే పెద్ద అనారోగ్యం! లోకంలోని ఇతర దంపతులకూ మనకూ ఉమ్మడిగా ఉన్నవి అంశం ఈ ఏకాంతమే! ఈ విషయంలో ఇతరుల్తోబాటే మనమూ నార్మల్ గా ఉన్నామన్న తృప్తి పొందక పోవటయే మహా అనారోగ్యం! ఇప్పట్నుంచే బలవంతంగా వైరాగ్యాన్ని మనస్సు కెక్కించుకోవటం దారుణమైన అనారోగ్యం!... మీ రెంత రసికులో నాకు తెలీదా! మీరిప్పుడీవిధంగా గుర్రుపెట్టి నిద్రపోతూ మీకు సహజంగా ఉన్న అనేక సరదాల్ని బలవంతంగా నిద్రపుచ్చటం ఉందే- ఇది, దారుణమైన అనా.. అనా..అనా.. అనారోగ్యం!... ఊఁ, లేవండీ లేచి కూర్చోండి, కబుర్లు చెప్పండిః... ఇంకో విషయం; ప్రేమించే శక్తి స్త్రీకి ఎనిమిది రెట్లెక్కువట. ఆ శక్తి రిలీజవ్వదనుకోండి, టెన్షన్ పెరిగిపోవచ్చు నాకు. అది గొప్ప అనారోగ్యం అంటే సైకోసిస్ అన్నమాట? అది చురుగ్గా న్యూరాస్తేనియాగా మారుతుంది. అది న్యూరాల్జియాలోకి, అది మళ్ళీ న్యూరిటిస్‌లోకి సర్రున దిగిపోతాయి అంటే నేను న్యూరోహిస్టీరియాకల్ సైకోమానియాక్‌నైపోతానన్నమాట. ఇహ ఈ సుందరి మీకు దక్కటం వట్టిది!"

యోగారావు నవ్వాడు పకపకా నవ్వాడు సుందరి శృతి కలిపింది.

యోగారావన్నాడు! " ఆల్‌రైట్, నిన్ను కష్టపెట్టటం నాకిష్టంలేదు. నీకు పిచ్చెక్కితే - ఆహా, ఎక్కడనుకో, కాని నువ్వు చెబుతున్నావు గదా! నేను సహించగలనా! అమ్మో నాకూ పిచ్చెక్కదూ. సరే, నేనేం తక్కువ తిన్లేదు ప్రేమించేశక్తి నాకు పదహారు రెట్లు చూసుకో" యోగారావు సుందరిని చటుక్కున తన బాహువుల్లోకి తీసుకున్నాడు.

(స్వాతి సపరివార పత్రిక., 21-9-84.)

★★★ ★★★ ★★★